# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్**


చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

చెన్నూర్, ఆగస్టు 13 : ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ అన్నారు. మంగళవారం చెన్నూర్ ప్రభుత్వ దవాఖానను ఆయన సందర్శించారు. అన్ని వార్డులు, రికార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు. దవాఖానలో రెండు సాధారణ ప్రసవాలు, పెద్ద ఆపరేషన్ ద్వారా ఒక ప్రసవం జరుగగా తల్లీబిడ్డల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫోగ్రాం అధికారి ప్రసాద్, దవాఖాన సూపరింటెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారులు, వైద్యులు

# వైద్యుల నిరసన

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 13 : కోల్‌కతాలోని మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ మంగళవారం మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన చేపట్టారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని సూపరింటెండెంట్ డా.హరీశ్‌చంద్రా రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవోలు డా.భీష్మా, డా.శ్రీమన్నారాయణ, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.


మంగళవారం ఉదయం 9.20 గంటలకు ఖాళీగా కనిపిస్తున్న జనరల్ డాక్టర్ కుర్చీ


ఉదయం 9.30కు విధులకు వచ్చి 10.45 గంటలకే తిరిగి వెళ్తున్న వైద్యురాలు (మధ్యాహ్నం 1 గంట వరకు కూడా తిరిగి రాలేదు)


ఉదయం 11 గంటలకే దవాఖాన నుంచి వెళ్లిపోతున్న మరో వైద్యుడు


జీజీహెచ్‌లో ఓపీ తీసుకునేందుకు క్యూలైన్‌లో నిలుచున్న రోగులు

# వైద్యులున్నా.. అందని వైద్యం

**విధులకు ఆలస్యంగా హాజరవుతున్న డాక్టర్లు**

- సదుపాయాలు లేక అవస్థలు పడుతున్న రోగులు
- నిరుపయోగంగా మారిన మూత్రశాలలు, ఎక్స్‌రే యంత్రాలు
- ట్రైయినీ విద్యార్థులు పని చేస్తుంటే చోద్యం చూస్తున్న రెగ్యులర్ సిబ్బంది
- ఒకటి, రెండు గంటలు పని చేసి వెళ్లిపోతున్న వైద్యులు
- సమస్యలకు నిలయంగా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ దవాఖాన
- చెన్నూర్, బెల్లంపల్లి, లక్షెట్టిపేట ఆసుపత్రుల్లోనూ ఇబ్బందులు

మంచిర్యాల, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సీజనల్ వ్యాధులు ప్రజలను సతమతం చేస్తున్నాయి. ఏ ఇంటికి వెళ్లినా ఒకరు అనారోగ్యంతో సతమతం అవుతున్న వారే కనిపిస్తున్నారు. సీజనల్ వ్యాధులతో బాధపడుతూ ప్రభుత్వ దవాఖానలకు వైద్యం కోసం వచ్చేవాళ్లు రోజురోజుకు అధికం అవుతున్నారు. మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు రోగుల తాకిడి పెరుగుతున్నది. ఈ యేడాది ఇప్పటివరకు 1,148 మంది జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. 1,288 మంది కుక్కకాటు బాధితులు వచ్చారు. బాధ్యతగా తీసుకుని పని చేయాల్సిన డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విమర్శలకు దారిస్తున్నది. జిల్లా ఆసుపత్రికి సమయానికి డాక్టర్లు రావడం లేదని మంగళవారం 'నమస్తే తెలంగాణ' పరిశీలనలో తేటతెల్లమైంది. ఉదయం 9 గంటలకు దవాఖానకు రావాల్సిన కొందరు డాక్టర్లు ఆలస్యంగా వచ్చారు. 9గంటలకు 'నమస్తే తెలంగాణ' హాస్పిటల్‌కు వెళ్లిందని తెలిశాక డాక్టర్లకు సమాచారం వెళ్లింది. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ 9.10 గంటలకు ఆసుపత్రికి వచ్చారు. అప్పటికీ ఓపీ చూసే డాక్టర్లు లేరు. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్లు వచ్చే వరకు ఓపీలో కూర్చున్నారు. డాక్టర్లతో ఫోన్ చేసి మాట్లాడారు. ఆయన ఫోన్ చేశాక 9.15 గంటలకు ఒక డాక్టర్, 9.30గంటలకు మరో ముగ్గురు డాక్టర్లు విధులకు హాజరయ్యారు. అప్పటి వరకు జ్వర పీడితులను చూసే వార్డు, స్కిన్ అండ్ ఈఎన్‌టీ వార్డులో డాక్టర్లు కనిపించలేదు. వచ్చిన డాక్టర్లలో ఒకరు 10.45కు ఒక వైద్యురాలు వెళ్లిపోగా, మరో డాక్టర్ ఉదయం 11గంటలకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం 1 గంట వరకు 'నమస్తే తెలంగాణ' ఆ డాక్టర్లు తిరిగి వస్తారేమోనని ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. విధుల విషయంలో వైద్యులు ఎంత శ్రద్ధ చూపిస్తున్నారో ఈ ఘటనతో బయటపడినట్లు అయ్యింది.

### పని చేయాల్సినోళ్లు కూర్చున్నరు..

ఇక ఆసుపత్రి లోపల డ్యూటీ చేయాల్సిన నర్సులు కూర్చొని కనిపిస్తే, శిక్షణలో ఉన్న నర్సింగ్ విద్యార్థులు వైద్యసేవలు అందిస్తూ కనిపించారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం అంశాన్ని పక్కన పెడితే జీజీహెచ్‌లో అనేక సమస్యలు దర్శనమిచ్చాయి. మూత్ర పరీక్షల కోసం శాంపిల్స్ తీసుకునేందుకు మూత్రశాలలు లేవు.


'నమస్తే తెలంగాణ' విజిట్ ఉందని తెలుసుకుని ఆసుపత్రికి వచ్చిన సూపరింటెండెంట్

ఆసుపత్రి లోపల ఉన్న మూత్రశాలలు నిరుపయోగంగా ఉండడంతో మూత్రం శాంపిల్స్ కోసం సీసాలు పట్టుకుని బయటికి వెళ్తూ కొందరు, పైనున్న వార్డుల్లోని మూత్రశాలలకు వెళ్తూ మరికొందరు కనిపించారు. ఆసుపత్రిలో మూడు ఫీవర్ వార్డులను ఏర్పాటు చేసినా రోగులకు సరైన వైద్యం అందడం లేదని తెలిసింది. రోజుకు ఉదయం పూట ఒకసారి మాత్రమే వైద్యులు వచ్చి చూస్తున్నారని రోగులు చెప్తున్నారు. బెడ్లు సరిపోక వరండాలో మడత మంచాల పైనే కొందరు రోగులను ఉంచారు. అక్కడ ఫ్యాన్లు కూడా కనిపించలేదు. ఆసుపత్రి వెనుకవైపు ఉన్న ఖాళీ స్థలంలో ఆసుపత్రి వ్యర్థాలు పారేసి ఉన్నాయి. ఎక్స్‌రే మిషన్‌తోపాటు మూడు వాటర్ ప్యూరీఫయర్లలో ఒకటి నిరుపయోగంగా మారింది.

### లక్షెట్టిపేటలో డిప్యూటేషనోళ్లు ఎక్కువ

లక్షెట్టిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోజూ 80 నుంచి 100 వరకు ఓపీ చూస్తున్నారు. వైరల్ ఫీవర్లు, కాళ్లు, ఒళ్లు నొప్పులతో చాలా మంది వస్తున్నారు. ఇక్కడి ల్యాబ్‌లో సీబీపీ, హెచ్‌బీఎస్‌ఏబీ, టీబీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇతర పరీక్షల కోసం మంచిర్యాల టీ హబ్‌కు రక్త నమూనాలను పంపిస్తున్నారు. ఆసుపత్రిలో ఆరుగురు వైద్యులు ఉంటే అందరూ వివిధ ప్రాంతాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చినవారే కావడం గమనార్హం. ఈ ఆసుపత్రి వైద్య విధాన పరిషత్‌కు అప్‌గ్రేడ్ అయి మూడేండ్లు గడుస్తున్నప్పటికీ ఎంత మంది వైద్యులను ఈ ఆసుపత్రికి కేటాయించాలనే నివేదిక రాలేదు. ఆసుపత్రిలో మందుల కొరత లేనప్పటికీ సెలైన్స్ స్టాక్ తక్కువగా ఉందని తెలిసింది.

### చెన్నూర్‌లో పేరుకే పెద్ద దవాఖాన

చెన్నూర్‌లోని ప్రభుత్వ దవాఖానకు పురుగుల మందు తాగిన వారు, ప్రమాదాలకు గురై గాయపడిన వారు, వివిధ రోగాలతో అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవల కోసం వస్తే ప్రాథమిక చికిత్స మాత్రమే చేస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఇతర దవాఖానకు రెఫర్ చేస్తున్నారు. దీంతో పేరుకే పెద్ద దవాఖానగా పేరు మార్చుకున్నా ఆసుపత్రిలో కేవలం మామూలు రోగాలకు మాత్రమే చికిత్స అందిస్తున్నారు. ఈ దవాఖానలో అన్ని రకాల వైద్య నిపుణులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఇద్దరు స్త్రీల వైద్య నిపుణులు, ఇద్దరు పిల్లల వైద్య నిపుణులు, ఒక్కరు జనరల్ ఫిజీషియన్, ఒక్కరు దంత వైద్యనిపుణుడు, ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లు మాత్రమే ఉన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి దాదాపు పది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎక్స్‌రే ప్లాంట్, అల్ట్రాసౌండ్, సీఆర్ యంత్రాలను కొనుగోలు చేయలేదు. ఎముకల వైద్య నిపుణులు, ఈఎన్‌టీ వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు, జనరల్ సర్జన్ డాక్టర్లను నియమించక పోవడంతో ఆ వ్యాధులతో బాధపడుతూ వచ్చే వారికి బయటికి రెఫర్ చేస్తున్నారు.

### బెల్లంపల్లిలో వైద్యుల కొరత..

బెల్లంపల్లి వంద పడకల దవాఖానలో వైద్యుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా వైద్యులు లేక ప్రజలు ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్నారు. కేవలం ఆర్థో, అనస్థీషియా, ఆప్తామాలజిస్ట్, ఇద్దరు మెడికల్ అధికారులు మాత్రమే సేవలందిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని దవాఖాన తర్వాత ఇక్కడికే వచ్చి చికిత్సలు పొందుతారు. ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి సహా బెల్లంపల్లి నియోజకవర్గంలోని మండలాలు, మందమర్రి, చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం ఇక్కడికి వస్తు ఉంటారు. ఒకే వైద్యుని వద్ద రోగులు గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకున్నది.

**నమస్తే విజిట్ NAMASTE VISIT**

### ఇంద్రభవనం కాదు.. సర్దుకొండి అన్నారు..



జ్వరంతో బాధపడుతున్న నా భార్యను వారం రోజుల క్రితం మంచిర్యాల జీజీహెచ్‌కు తీసుకొచ్చా. జాయిన్ అయిన మూడు రోజులకు అన్ని బ్లడ్ టెస్టులు రాశారు. మరుసటి రోజు మధ్యాహ్నం డాక్టర్లు వెళ్లిపోయాక ఆ టెస్టు రిపోర్టులు వచ్చారు. తెల్లారి వచ్చాక డాక్టర్ వాటిని పరిశీలించారు. ఈ సమయంలో నా భార్యకు ఏదైతే జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారు. ప్రైవేటుకు వెళ్లే స్థోమత లేక గవర్నమెంట్ దవాఖానకు వచ్చాను. వారం రోజులైన జ్వరం తగ్గలేదు. ఏమైపోతుందో అని భయంగా ఉంది. ఆసుపత్రిలో తాగునీటికి తీవ్రమైన ఇబ్బంది ఉంది. బయటి నుంచి తెచ్చుకుని తాగాల్సి వస్తున్నది. ఇబ్బంది ఉందని సూపరింటెండెంట్‌ను అడిగితే నాకు ఏం ఇంద్రభవనం ఇవ్వలేదు. ఇచ్చిన ఈ బిల్డింగ్ ఎలా ఉందో అలా వాడుకుని సర్దుకుపోవడమే తప్ప చేసేందేమీ లేదంటూ మాట్లాడారు. *- మేకల శ్రీధర్, గద్దెరాగడి.*

### మందులు బయట తెచ్చుకున్నా..



నా కాలికి దెబ్బతగిలి చికిత్స కోసం మంచిర్యాల జీజీహెచ్‌కు వచ్చా. మూడు ట్యాబ్లెట్లు రాస్తే అందులో ఒకటి అందుబాటులో లేదు. దీంతో ఒక ట్యాబ్లెట్ రూ.30 పెట్టి బయటి నుంచి కొనుగోలు చేశా. మందుల కొరత లేదని డాక్టర్లు చెప్తున్నారు. మందుల కొరత ఉంది కాబట్టే నేను బయట తెచ్చుకుంటున్నా. *- ఎస్‌కే తాజ్‌బాబా, మంచిర్యాల*

### మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం

దవాఖానలో ఇబ్బందులున్నాయి. జ్వరపీడితుల కోసం మూడు వార్డులు ఏర్పాటు చేశాం. పేషెంట్లు పెరగడంతో సరిపోవడం లేదు. బయట మంచాలు వేసి సేవలు అందిస్తున్నాం. ఈ సమయంలో మూత్రశాలలు సరిగా లేవు. అవి పని చేయడం లేదు. ఇవి పని చేయడం లేదు అని ఆలోచించాల్సిన పని లేదు. ఉన్నవాటితో పని చేసుకోవడం తప్పా వేరే అంశాలు ఆలోచించడం లేదు. వైద్యులు, స్టాఫ్ నర్సుల కొరత ఉంది. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు మేం కృషి చేస్తున్నాం.

*- హరిశ్చంద్రారెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్, మంచిర్యాల.*

# ఆశ కార్యకర్తల నిరవధిక సమ్మె

దండేపల్లి, ఆగస్టు13 : బెల్లంపల్లిలోని శంశీర్ నగర్ యూపీహెచ్‌సీలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్కను సూపర్‌వైజర్ మధు అసభ్య పదజాలంతో దూషించడం తగదని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం దండేపల్లి మండల కేంద్రంలో ఆశ కార్యకర్తలు నిరవధిక సమ్మె చేపట్టారు. ఎంపీడీవో ప్రసాద్, ఎస్ఐకి వినతిపత్రం అందించారు. ఆయనపై చర్యలు తీసుకునే వరకూ విధులకు హాజరుకాబోమన్నారు.

తాండూర్, ఆగస్టు 13 : సమ్మక్కను వేధింపులకు గురిచేసిన సూపర్‌వైజర్ మధుపై చర్యలు తీసుకోవాలని ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడే నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేల్పుల శంకర్, దుర్గం నానయ్య, ఆశ కార్యకర్తలు రాజేశ్వరి, కవిత, నర్సుబాయి, లక్ష్మి, సునీత, సుమలత, భాగ్య, స్వప్న, భారతి, సంధ్యారాణి, విజయ, హారిక, సావిత్రి, రేవతి, విజయలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.


తాండూర్‌లో డీటీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

## 10 రోజులకు పైగా ట్రాక్టర్‌లోనే మొక్కలు


ట్రాక్టర్‌లోనే వదిలేసిన వనమహోత్సవం మొక్కలు

*వన మహోత్సవంలో భాగంగా తలోడి గ్రామం లో నాటాల్సిన మొక్కలు 10 రోజులకు పైగా పంచాయతీ ట్రాక్టర్‌లోనే ఎండుతున్నాయి. వన మహోత్సవం లో భాగంగా మొక్కలు నాటేందుకు ట్రాక్టర్‌లోకి మొక్కలను ఎక్కించారు. ఆపై నాటకుండానే కారోబార్ ఇంటి ముందు ట్రాక్టర్‌ను నిలిపారు. 10 రోజులకు పైగా ట్రాక్టర్‌లోనే మొక్కల ను ఉంచడంతో అవి ఎండి పోతున్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పెంచిన మొక్కలను ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం పంచాయతీ సిబ్బంది పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నది. - కౌటాల, ఆగస్టు 13*

# ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి

- ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు
- 30 మందికి సెల్‌ఫోన్‌ల అప్పగింత

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఆగస్టు 13 : సెల్‌ఫోన్ పోతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఆసిఫాబాద్‌లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సుమారు రూ. 6 లక్షల విలువైన 30 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ చోరీకి గురైనా, పడిపోయినా వెంటనే ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకునే అవకాశముందన్నారు. 2024లో జిల్లా వ్యాప్తంగా 183 ఫోన్‌లను ఈ పోర్టల్ ద్వారా స్వాధీనం చేసుకొని బాధితులకు అందించినట్లు తెలిపారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉంటూ అపరిచిత లింకులు, మెసేజ్‌లు ఓపెన్ చేయకూడని సూచించారు. ఇక్కడ ఏఎస్పీ ప్రభాకర్‌రావు, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్, ఐటీ కోర్ సిబ్బంది శ్రీను, మారుతి ఉన్నారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**


వార్డుల్లో పర్యటిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్, ఆగస్టు 13 : పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ దీపక్‌కుమార్ అన్నారు. మంగళవారం చెన్నూర్‌లో ఆకస్మికంగా పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. 6వ వార్డు పద్మనగర్ కాలనీ వారితో మాట్లాడారు. తాగు నీరు సరఫరా, పారిశుధ్య పనుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. పద్మనగర్ కాలనీలోని ప్రభుత్వ పాథమిక పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. పట్టణంలో కొత్తగా మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బృహత్ పట్టణ పకృతి వనాన్ని సందర్శించి, నర్సరీల్లోని మొక్కలు, ఇప్పటి వరకు నాటిన మొక్కలు, ఇంటింటికీ పంపిణీ చేసిన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

# దవాఖానలు కిటకిట

- పెద్ద ప్రభుత్వ హాస్పిటల్‌లో బీపీ గోలీలు కరువు
- డయాగ్నోస్టిక్ సెంటర్‌లో కానరాని ల్యాబ్ టెక్నీషియన్‌లు
- పెరుగుతున్న సీజనల్ వ్యాధులతో కిటకిటలాడుతున్న దవాఖానలు
- సిర్పూర్(టీ) దవాఖానలో ఒకే బెడ్‌పై ఇద్దరేసి రోగులు


ఔట్ పేషెంట్లతో కిటకిటలాడుతున్న జిల్లా కేంద్రంలోని దవాఖాన

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : సర్కారీ వైద్యంపై రోగుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. సీజనల్ వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో కనీసం రోగులకు గోలీలు ఇవ్వలేని దుస్థితి నెలకున్నది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానతో పాటు ఆయా మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా కేంద్రంలోని దవాఖానకు ప్రతి రోజూ 400 మంది వరకు ఔట్‌పేషెంట్లు ఉండగా, 15 మంది ఇన్‌పేషెంట్లు చేరుతున్నారు. జైనూర్, కాగజ్‌నగర్, సిర్పూర్ మండలాల్లోని దవాఖానలకు రోజుకు 200 నుంచి 300 మంది వరకు రోగులు వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు నిత్యం 50 మంది చొప్పున రోగులు వస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా సరైన వైద్యం అందడం లేదు. 20 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో 46 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, 14 మంది వైద్యులు మాత్రమే రెగ్యులర్‌గా ఉన్నారు. మరో ఆరుగురు వైద్యులు


సిర్పూర్-టి దవాఖానలో ఒకే బెడ్‌పై ఇద్దరు పేషెంట్లు

కాంట్రాక్టుపై పనిచేస్తుంగా, 26 పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. 77 మంది స్టాఫ్ నర్సు పోస్టులు ఉండగా 38 ఖాళీలు ఉన్నాయి. ఫార్మసిస్టులు 25 పోస్టులు ఉండగా, 10 మంది రెగ్యులర్‌గా, మరో 12 మంది కాంట్రాక్టుపై ఉన్నారు. 3 ఖాళీలు ఉన్నాయి. ల్యాబ్ టెక్నీషియన్‌లు 26 మంది కావాల్సి ఉండగా రెగ్యులర్‌గా ఏడుగురు, కాంట్రాక్టుపై 12 మంది ఉన్నారు. మరో 7 ఖాళీలు ఉన్నాయి. ఏఎన్ఎంలు, ఇతర పోస్టులు వందకు పైగా ఖాళీలు ఉన్నాయి.

### డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌ల కొరత

జిల్లా కేంద్రంలోని డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ల్యాబ్ టెక్నీషియన్‌ల కొరత వేధిస్తున్నది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 ప్రాథమి ఆరోగ్యకేంద్రాలతోపాటు, సామాజిక ఆరోగ్యకేంద్రాలు, జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వచ్చే రోగుల రక్తనమూనాలను పరీక్షించి రోగ నిర్ధారణ చేసే డయాగ్నొస్టిక్ సెంటర్‌లో 9 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఉండగా, కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. ప్రతి రోజూ 1000 రక్త నమూనాలను చేయగలిగిన సామర్థ్యం ఉన్న ఈ కేంద్రంలో గతంలో 56 రకాల పరీక్షలు చేసేవారు. గతేడాది ప్రభుత్వం 134 రకాల పరీక్షలు నిర్వహించేస్థాయికి పెంచింది. జిల్లా వ్యాప్తంగా ప్రాథక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల రక్తనమూనాలను తీసి జిల్లా కేంద్రంలో ఉన్న ఈ డయాగ్నోస్టిక్ కేంద్రానికి పంపిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌ల కొరత కారణంగా ప్రతి రోజూ 300 నుంచి 400 వరకు మాత్రమే రక్త నమూనాలను పరీక్షిస్తున్నారు.

### డయాలసిస్ రోగులకు మందులు లేక..

జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లలో డయాలసిస్ సెంటర్లు ఉండగా, 76 మంది రోగులు ఉన్నారు. వారానికి రెండుసార్లు వీరికి డయాలసిస్ కేంద్రాల్లో రక్తశుద్ధి చేయాల్సి ఉంటుంది. డయాలసిస్ రోగులకు రక్తం పెంచేందుకు అవసరమైన ఈపీవో, ఎరిత్రో పోయిటిన్ మందులు అందుబాటులో ఉండకపోవడంతో రోగులు బయట నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ కేంద్రాల్లో ఉన్న రెండు డయాలసిస్ సెంటర్లలో 10 బెడ్‌లు ఉన్నాయి. ఈ రెండు కేంద్రాల్లో కూడా మందులు అందుబాటులో లేవు. దీంతో పాటు ఐరన్ ఇంజక్షన్‌లు కూడా సెంటర్లలో అందుబాటులో లేకపోవడంతో రోగులపై ఆర్థిక భారం తప్పడం లేదు.

*ఈమె పేరు కళావతి. ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామం. బీపీతో బాధపడుతూ మంగళవారం జిల్లాకేంద్రంలోని దవాఖానకు వచ్చింది. పరీక్షించిన డాక్టర్ బీపీ గోలీల చీటీ రాసి ఇచ్చారు. మందులు ఇచ్చే కౌంటర్ వద్దకు వెళ్తే బీపీ గోలీలు లేవని.. బయట కొనుక్కోమని ఉచిత సలహా ఇచ్చారు. దీంతో బయట కొనుక్కోవాల్సి వచ్చింది.*



*ఈ వృద్ధురాలి పేరు రాజమ్మ. కొండపల్లి గ్రామం. తన కొడుక్కు జ్వరం వస్తే రెండు రోజల క్రితం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చింది. పేషెంట్‌కు ఇచ్చేందుకు వెర్‌టాయిన్ ట్యాబ్లెట్లు అందుబాటులో లేకపోవడంతో బయట నుంచి కొని తీసుకురావాలని చీటీ రాసి ఇచ్చారు.*



*ఈ చిత్రంలో ఉన్న ఇద్దరు పిల్లలు డెంగ్యూ పేషెంట్లు. ఒకరు సిర్పూర్ (టీ) మండల కేంద్రానికి చెందిన ఎర్రోజు శివ, మరొక అమ్మాయి కౌటాలకు చెందిన షాను. సిర్పూర్-టీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగ్యూకు చికిత్స చేయకపోవడంతో అంబులెన్స్‌లో మంచిర్యాల హాస్పిటల్‌కు తరలిస్తున్నారు.*



- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం

మరియు

- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679